క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఒంటారెడ్డిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి ఆసియా సూచించారు. మంగళవారం మండలంలోని ఒంటారెడ్డిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 44 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా,డెంగీ తదితర వ్యాధుల సోకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేశారు.

కలుషిత ఆహారంతోనే అతిసారం వ్యాప్తి

కూడేరు: కలుషిత ఆహారం తినడం, తాగు నీటిని తాగడంతోనే డయేరియా(అతిసార) వ్యాధి వస్తుందని హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం కూడేరులోని హైస్కూల్‌లో అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందుజాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, హెచ్‌ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్‌ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూతన పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన పెన్షనర్ల సంఘం సభ్యులు

కంబదూరు: మండల పెన్షనర్ల అసోసియేషన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. గతంలో ఉన్న కమిటీని రద్దు చేసి, నూతనంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడిగా సురేంద్ర, ట్రెజరర్‌గా మస్తానప్ప, కార్యదర్శిగా వహాబ్‌ఖాన్‌తో పాటు కమిటీ సభ్యులు ఎస్. పాల్ తదితరులను ఎన్నుకున్నారు.

కౌలు రైతు సమస్యలపై సంతకాల సేకరణ



ఉరవకొండలో సంతకాల సేకరణ చేపట్టిన కౌలు రైతుసంఘం నాయకులు

ఉరవకొండ: కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈసందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డు అందాలంటే రైతు సంతకం నిబంధన తొలగించాన్నారు. దీంతో పాటు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం, బీమా, ఆత్మహత్యల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలు అమ్ముకునేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి శీతలగిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్లు తీర్చాలని కౌలు రైతుల ద్వారా సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పంపుతామన్నారు.

4న విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గంటౌన్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 4న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు అనిల్ విద్యార్థులతో కలిసి బంద్ పోస్టర్లను విడుదల చేశారు.

ఉరవకొండ: నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈనెల 4న బంద్ చేస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు హారున్‌రషీద్, ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రేగాటి శివకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హిరణ్య మాట్లాడారు. నీట్ పరీక్ష రద్దు చేసే వరకూ ఆందోళన విరమించేదిలేదని అన్నారు.



ట్రాక్టర్‌లో తరలుతున్న కలప

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- రాత్రివేళల్లో తరలిస్తున్న వ్యాపారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అటవీ అధికారులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి.. అని ప్రభుత్వాలు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు చెప్తున్నా.. ఆచరణలో మాత్రం ఎక్కడో ఒక చోట కొందరు స్వార్థపరులు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నారు. జనాభాకనుగుణంగా మొక్కలు నాటకపోవడంతోపాటు ఉన్న చెట్లు కూడా నరికివేస్తుండడంతో ప్రకృతి ప్రకోప పరిస్థితులు వెంటాడుతున్నాయి. వేసవికి ముందే ఎండలు బాదడం, అసలు సమయంలో కాకుండా ముందస్తుగానే వర్షాలు కురవడం, ఆ తర్వాత ముసుగేయడం లాంటి కారణాలు అద్దం పడుతున్నాయి. ఈ విధానం ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తప్పవని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సి ఉంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోని వేలాది ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఆయా పరిధిలోని అనేక రకాల వృక్షాలు పెరిగి పెద్దయ్యాయి. లక్షలాది చెట్లతో పచ్చని అడవులు స్థానికులను ఆకట్టుకుంటోంది. పరిసర గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన గాలి, పూలు, పండ్లను అందిస్తోంది. మానవాళి మనుగడకు ప్రాధాన్యం ఇస్తున్న చెట్లను అమాంతం నరికివేస్తూ యథేచ్ఛగా వాప్యారం చేస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో రంపపు కోతతో భారీ వృక్షాలను నేలకొరిగేలా చేస్తున్నారు. అనంతరం చిన్న చిన్న మొద్దులుగా మార్చేస్తున్నారు. వాటిని రాత్రివేళ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పట్టణ సమీపంలో 120 చింత వృక్షాలు నేల కూల్చడమే ఇందుకు నిదర్శనం. ఎక్కువ భాగం కట్టెల షామియానాలు, కట్టెల డిపోలకు తరలిస్తున్నారు. కొందరు కలప వ్యాపారం చేస్తున్నారు. పచ్చని చెట్లను నరికేందుకు కొందరు అటవీశాఖ అధికారులు సైతం అనుమతులు ఇస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

అమలుకాని నిబంధనలు..

నిబంధనల ప్రకారం రైతులు తమ పొలాల్లో ఉన్న చెట్లను నరికివేయాలనుకుంటే అటవీశాఖ అధికారులకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేయాలి. ఆ తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలాంటి నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళ కలప రవాణా చేసుకుంటూ దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పర్యావరణాన్ని చేతులారా నాశనం చేస్తున్నారు. ఓవైపు ప్రభుత్వం వర్షాకాలంలో మొక్కలు నాటిస్తుండగా క్షేత్రస్థాయిలో కొందరు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. కలప అక్రమ రవాణాపై నిఘా పెంచి కట్టడికి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పట్టణ సమీపాన మోడువారిన పచ్చని వనం

చర్యలు చేపడతాం..

రైతులు దరఖాస్తు చేస్తే పరిశీలించాకే చెట్ల నరికివేతకు అనుమతిస్తున్నాం. ఎక్కడ పొరపాట్లకు తావివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. అయినా కొందరు గుట్టుచప్పుడు కాకుండా రాత్రిళ్లు కలప తరిస్తున్నట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీని కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. చెట్ల వినాశనాన్ని కోరుకుంటే ఎంతటి వారైన సరే ఉపేక్షించేది లేదు. చట్టపరమైన చర్యలు చేపడతాం. అటవీ ప్రాంతాల్లో ఎక్కడ చెట్లు నరకడం లేదు. కేవలం రైతు పొలాల్లో మాత్రమే వ్యాపారులు కొని రవాణా చేస్తున్నట్టు అభియోగం. ఇక మీదట అనుమతి లేకుండా కలప కనిపిస్తే సీజ్ చేయిస్తాం. సిబ్బందిని అప్రమత్తం చేసి నిఘా ముమ్మరం చేయిస్తాం.

– సీ మధుబాబు, ఫారెస్ట్ రేంజర్, కళ్యాణదుర్గం

నేటి నుంచి పశువులకు టీకా

బెళుగుప్ప: మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు వ్యాప్తి చెందే బొబ్బ, చర్మ వ్యాధి నివారణకు బుధవారం నుంచి ఉచితంగా టీకా వేస్తున్నట్లు పశు వైద్యాధికారి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. బెళుగుప్ప, గంగవరం గ్రామాల్లోని పశువైద్య కేంద్రాల్లో టీకా వేస్తామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు నాయకులు డిమాండ్ చేశాయి. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతురాయుడు మాట్లాడారు. ఈనెల 4న దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు నవీన్, పట్టణ అధ్యక్షుడు హర్షవర్దన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ



శ్రీరంగాపురంలో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగాపురం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సుబ్బరాజు, ఈఓఆర్‌డీ మాధవ్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పింఛన్ల పంపిణీపై ఆరాతీశారు. గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు శ్రీరాములు, అశోక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్రం శ్రీనివాసులు మృతి తీరనిలోటు

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి షెక్షానుపల్లికి చెందిన గుర్రం శ్రీనివాసులు (46) మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం షెక్షానుపల్లికి చేరుకున్న ఆయన గుర్రం శ్రీనివాసులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... గత నెల 30న జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశానికి చివరి సారిగా శీను హాజరయ్యారన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. శ్రీనివాసులు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. శ్రీనివాసులు భార్య అయ్యమ్మ, ఇద్దరు కుమారులను పరామర్శించారు. ఈ సందర్భంగా విశ్వ వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ నరసింహులు, పార్టీ నాయకులు అశోక్, మూలగిరిపల్లి ఓబన్న, కొడిగి గోవిందు, సుంకన్న, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, నింబగల్లు హనుమప్ప, ఈశ్వర్, ప్రసాద్, వేమన్న, పచ్చివరి, రామకృష్ణ, వడ్డే ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



గుర్రం శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



శ్రీనివాసులు (ఫైల్)

4న వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలు, కార్లను ఈనెల 4న వేలం వేస్తున్నట్లు సెట్ సీఐ వెంకట్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ. 1000 డిపాజిట్ చేయాలన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



సీసీ ఆంజనేయులు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

కంబదూరు: ఉద్యోగులు ఎవరైనా ప్రజలకు అందించిన ఉత్తమ సేవలతోనే గుర్తింపు వస్తుందని, కలకాలం గుర్తుండిపోతారని ఏపీఎం రాజశేఖర్ తెలిపారు. మండలంలోని రాళ్లఅనంతపురం క్లస్టర్‌లో సీసీ జీహెచ్ ఆంజనేయులు ఉద్యోగ విరమణ చేశాడు. మంగళవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు దంపతులను సిబ్బంది సన్మానించారు.

టీబీ బాధితులను నిర్లక్ష్యం చేయొద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ

కళ్యాణదుర్గం రూరల్: టీబీ బాధితులను నిర్లక్ష్యం చేయరాదని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అనుపమ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని టీబీ, లెప్రసీ యూనిట్లను డాక్టర్ అనుపమ మంగళవారం తనిఖీ చేశారు. టీబీ బాధితులకు అందాల్సిన చికిత్సను నిర్లక్ష్యం చేయకుండా, సకాలంలో మందులు అందించాలన్నారు. అనంతరం మందుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రసన్న భారతి, జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ వెంకటరమణ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సత్యానారాయణ, డీపీసీ, ఏపీఎంఓ శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ దౌర్జన్యాలపై 4న మహా ధర్నా

- ధర్నాకు హాజరుకానున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, జిల్లా ముఖ్యనేతలు

ఉరవకొండ: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుబడినప్పటి నుంచి టీడీపీ దౌర్జన్యాలు, దాడులకు నిరసనగా ఈనెల 4న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా ఉంటుందని ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొడిగి గోవిందు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బసవరాజు, నరసింహులు, గోవిందు విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడులు చేస్తున్నా.. శాంతిభద్రతలు కాపాడాల్సిన వారు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదన్నారు. ఇలాంటి దాడులను ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింగయ్య, మాజీ ఎమ్మెల్యే శంకరనారాయణ, మాజీ ఎంపీ రంగయ్య తదితరుల ఆధ్వర్యంలో స్థానిక కవితా హోటల్ సర్కిల్ వద్ద మహాధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డయేరియా మరణాలను నివారించడమే లక్ష్యం

వజ్రకరూరు: అతిసార మరణాలను నివారించడమే లక్ష్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి తేజశ్వి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ యేరియా క్యాంపెయిన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వైద్యాధికారి తేజశ్వి మాట్లాడుతూ ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డయేరియా క్యాంపెయిన్‌లోభాగంగా కలుషిత నీరు, ఆహారం, చేతుల శుభ్రత గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారితేజశ్వి, హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి తేజశ్వి

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ డాక్టర్ సుధాకర్

కూడేరు: పశుపోషకులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు గాణాభివృద్ధి సంస్థ డీఎల్‌డీఏ డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం కూడేరు మండల పరిధిలోని కొర్రకోడులో జిల్లా పశు గాణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. డీఎల్‌డీఏ డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కృత్రిమ గర్భ కోశ వ్యాధులు, సీజనల్ వ్యాధులపై పశు పోషకులకు వివరించి ముందు జాగ్రతలు పాటించాలన్నారు. పశువుల ఎదుగుదల కోసం మినరల్ మిక్చర్, ఇతర మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు (ఏహెచ్‌ఏ)లు రఘువర్దన్, సుబ్బరాయుడు, ఎర్రిస్వామి, భవాని, యశోధ, రాఘవ, సర్దార్ బాషా, గోపాల మిత్రలు రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కూడేరు: వైద్య పరీక్షలు చేస్తున్న డీఎల్‌డీఏ డాక్టర్ సుధాకర్

నైపుణ్యానికి నెలవు...వృత్తి విద్యతో కొలువు



- శిక్షణకు ఆసక్తి చూపుతున్న గ్రామీణ విద్యార్థులు
- పేద విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఉపయుక్తం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులు (వృత్తి విద్య కోర్సులు) వరంలా మారాయి. వృత్తి విద్యా కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని గ్రామీణ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. ప్రతి ఏడాది ఎంతో మంది విద్యార్థులు రెండేళ్ల కోర్సును పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో మంచి జీతంతో రాణిస్తున్నారు.

కోర్సుల వివరాలిలా...:

పదోతరగతి పూర్తవగానే ప్రతి విద్యార్థి ఇంటర్ మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర కోర్సులు చదవాలని, ఆతర్వాత ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చేయాలనుకుంటారు. అధిక శాతం మంది విద్యార్థులు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. ఆ కోర్సులలో ప్రవేశం పొందాలని ఉన్నా, ఆర్థిక స్థోమత, కుటుంబ నేపథ్యం తదితర కారణలతో సతమతమవుతుంటారు. ఇలాంటి పేద విద్యార్థుల కోసం ఇంటర్‌లో రెండేళ్ల వృత్తి విద్యా కోర్సులు ప్రవేశ పెట్టారు. వీటిలో ప్రధానంగా ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్), సెరికల్చర్, ఈఈటీ, సీఎస్‌ఈ, సీఈటీ, ఎంఅండ్‌ఏటీ కోర్సులు ఉన్నాయి. అయితే వీటిలో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) కోర్సులకు భారీ డిమాండ్ ఉంది.

వృత్తి విద్యతో నైపుణ్యం మెరుగు



కళాశాలలో జనరల్ గ్రూపులతో పాటు వృత్తి విద్యా కోర్సులు ప్రవేశ పెట్టడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మొదటి సంవత్సరంలో 261 మంది, ద్వితీయ సంవత్సరంలో 134 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది ఇప్పటివరకు ఒకేషనల్ గ్రూప్‌లలో 150 మంది విద్యార్థులు చేరారు. జూలై నెలాఖరు లోపు పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరతారు.

– మల్లికార్జున, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ముసలిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముసలిరెడ్డి (80)అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ముసలిరెడ్డి మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు పూల మాల వేసి, నివాళులర్పించారు. మృతునికి భార్య జయమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచులు రాధ, ఉమేష్‌రెడ్డి, నాయకులు ఆర్‌టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యానారాయణరెడ్డి, గోనబావి ప్రతాప్‌రెడ్డి, మాజీ కన్వీనర్ అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.


మారెమ్మకు ప్రత్యేక పూజలు

బ్రహ్మసముద్రం : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన ఆకుపూజ చేసి, జంతుబలి ఇచ్చారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

తాగునీటిలో విష ప్రయోగం కేసులో నలుగురి అరెస్ట్

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లో విష ప్రయోగం చేసిన కేసులో నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రామంలో ప్రజలకు శుద్ధిజలాన్ని అందించేందుకు సుజలాన్ ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లోని నీటి ట్యాంకుల్లో గతనెల 15న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పురుగుల మందు కలిపిన విషయం విదితమే. ఈకేసులో నిందితులుగా భావిస్తున్న తట్రకల్లు తిప్పయ్య, బి.కొట్రేగౌడ్, తలారి హనుమంతు, తట్రకల్లు ఆనంద్‌గౌడ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి



పీసీ కొత్తకోట పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ తిమ్మప్ప

వజ్రకరూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. మంగళవారం మండలంలోని పీసీ ప్యాపిలితండా, పీసీ చిన్న ప్యాపిలి, పీసీ కొత్తకోట, పీసీ పెద్దప్యాపిలి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ తిమ్మప్ప తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. అనతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.